క్లుప్తంగా

సర్పంచ్‌గా అదనపు బాధ్యతలు



సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టనున్న నాగేంద్ర

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశి గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి దీర్ఘకాలిక సెలవు పెట్టడంతో ఆ స్థానంలో ఉపసర్పంచ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా సర్పంచ్ ఇటీవల ఎంపీడీఓ రాధికకు సెలవు మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు ఎంపీడీఓ జిల్లా పంచాయతీ అధికారులకు నివేదించారు. సర్పంచ్‌కు సెలవు మంజూరు చేస్తూ ఆమె తిరిగి విధుల్లో చేరే వరకు ఉపసర్పంచ్‌గా కొనసాగుతున్న ఈర్నపాటి ఉప్పరి నాగేంద్రకు సర్పంచ్‌గా అదనపు బాధ్యతలు ఇస్తూ ఉత్తర్వులిచ్చారు.

ఘనంగా నాగదేవతల ప్రతిష్ఠ



నాగదేవత విగ్రహాలను ప్రతిష్ఠ చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అబ్దులాపురంలోని శివాలయంలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నాగదేవతల ప్రతిష్ఠ జరిగింది. వేదపండితులు ఆలూరి రాఘవేంద్రప్రసాద్, నరసింహప్రసాద్ నాగదేవతలకు అభిషేకం, పూర్ణాహుతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు శివారెడ్డి, సంజీవ రాయుడు, రామసుబ్బారెడ్డి, శ్రీనివాస ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నాగప్రతిష్ఠోత్సవాలు

కోవెలకుంట్ల: పట్టణంలో నూతనంగా నిర్మించిన నాగులకట్ట వద్ద నాగ ప్రతిష్ఠ మహోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ప్రాత:కాల పూజ, యంత్ర అభిషేకం, గణపతి, సర్వసూక్త హోమాలు, మహా మంగళహారతి తదితర కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం విగ్రహ, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలు

బేతంచెర్ల: పట్టణంలోని పాతబస్టాండులో ప్రమాద వశాత్తు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో జంగాల పేట కాలనీకి చెందిన మద్దిలేటికి తీవ్ర గాయాలయ్యాయి. కాలు విరడంతో శేషారెడ్డి సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు.

విజయవంతంగా 'నా మట్టి- నా దేశం'



సేకరించిన మట్టి నమూనాలతో ఉపాధి సిబ్బంది

కోవెలకుంట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'నామట్టి- నాదేశం' కార్యక్రమం కోవెలకుంట్ల మండలంలో విజయవంతంగా సాగింది. పంద్రాగస్టు వేడుకలను పురస్కరించుకుని 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నా భూమి – నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ రాధిక, ఏపీఓ శ్రీవిద్య ఆధ్వర్యంలో ప్రతి గ్రామం నుంచి మట్టిని సేకరించిన విషయం తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం మట్టిని నమూనాలతో ర్యాలీ నిర్వహించి ఢిల్లీకి పంపే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్ రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి ఉపాధి పథక టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కొడి పీర్ల ఊరేగింపు



బేతంచెర్ల: మండల పరిధిలోని యంబాయిలో మౌలాలీ స్వామి, అల్లా బాషా అగ్బర్ కొడి పీర్ల వేడుకలను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొడి పీర్లను గ్రామంలో ఊరేగించారు. సర్పంచ్ యుగంధర్ రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ కమిటీ సభ్యుడు కృష్ణారెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్ రామ చంద్రుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, జయ ప్రకాశ్ రెడ్డి కొడి పీర్లను దర్శించుకున్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ ఫలాలు
- అభివృద్ధిని, మేలును బాధ్యతగా ప్రజలకు చేరవేయాలి
- ఓర్వలేక చేస్తున్న టీడీపీ అసత్యారోపణలను తిప్పికొట్టాలి
- డోన్ నియోజకవర్గ సమన్వయకర్త కోన మురళీధర్‌రెడ్డి, రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న కోనమురళీధర్‌రెడ్డి

డోన్ టౌన్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుందని డోన్ నియోజకవర్గ సమన్వయకర్త కోన మురళీధర్‌రెడ్డి, రాష్ట్రమీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు పేర్కొన్నారు. పార్టీలు, కులమతాలు, వర్గాలు, ప్రాంతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. స్థానిక షాదిఖానాలో శుక్రవారం ఐ–ప్యాక్ ఆధ్వర్యంలో సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. టీడీపీ అధినేత చంద్రబాబుకు తనకు ఎంతో అనుభవం ఉందని గొప్పలు చెప్పుకోవడం తప్పా ప్రజలకు చేసింది ఏమి లేదన్నారు. 2019లో అధికారం చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని, ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. ఏదైనా సాంకేతిక కారణాల మూలంగా ప్రభుత్వ పథకాలకు దూరమైన పేదలను గుర్తించి న్యాయం చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. చంద్రబాబు తన హయాంలో చెప్పుకునేలా చేసిందేమీ లేనందున నిస్పృహకు గురయ్యారని, ప్రజలను అయోమయం చేసేందుకు అసత్యారోపణలు, ఉద్రేకపూరిత ప్రసంగాలు చేస్తూ రెచ్చగొడుతున్నారని విమర్శించారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, పేదలకు జరిగిన మేలు ప్రజలకు బాధ్యతగా వివరించి టీడీపీ నాయకులు కుట్రలను తిప్పికొట్టాలని గృహ సారథులు, కన్వీనర్లకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్య, వ్యవసాయ రంగాలకు ఇస్తున్న ప్రాధాన్యతను, ఆ దిశగా అమలు చేసిన పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా విశదీకరించాలన్నారు. పిల్లలను బడికి పంపే ఏ తల్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అమ్మ ఒడితోపాటు జగనన్న విద్యా కానుక, విద్యా, వసతి దీవెనలు, విదేశీ విద్య తదితర పథకాలను సీఎం అమలు చేస్తున్నారని వివరించారు. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా మార్చిన విషయాన్ని గుర్తు చేయాలన్నారు. వైద్య రంగంలోనూ సీఎం జగనన్న పెనుమార్పులు తీసుకొచ్చారని, ఆసుపత్రులను ఆధునీకరణ చేపట్టారని, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసకొచ్చి కుగ్రామాల్లో సైతం ఇళ్ల దగ్గరే వైద్య సేవలు అందజేస్తున్నారని చెప్పారు. అదేవిధంగా రైతులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా నిలిచిందని, పెట్టుబడి సాయం నుంచి దిగుబడులు అమ్ముకునేంత వరకు అన్నదాతకు చేయూతనిస్తుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా ఇళ్ల వద్దకే అందుతున్న సేవలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రతిఒక్కరూ ఆశీర్వదించేలా చైతన్య పరచాలని ఈ సందర్భంగా కన్వీనర్లు, గృహ సారథులకు వారు పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొట్రికె హరికిషన్, జాకీర్ హుస్సేన్, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, ప్యాపిలి మాజీ జెడ్పీటీసీ దిలీప్ చక్రవర్తి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, ఎస్‌జేపీలు కురుకుంద హరి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 2,600కోట్లతో డోన్ అభివృద్ధి

మోడల నియోజకవర్గంగా డోన్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని కోన మురళీధర్‌రెడ్డి, రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు గుర్తు చేశారు. దశాబ్దాలుగా డోన్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన పెద్దపెద్ద మేధావులు, రాజకీయ ఉద్దడ్డులు చేయని అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలో మంత్రి బుగ్గన చేసిచూపారన్నారు. డోన్ నియోజకవర్గం అభివృద్ధికి దాదాపు రూ.2600కోట్లతో ఖర్చు చేశారని, రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారన్నారు. వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి, ఎస్సీ, బీసీ గురుకుల పాఠశాలలు, కళాశాలు, ఐటీఐ, పాలిటెక్నిక్, గొర్రెలు, పశు పోషణ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా కేంద్రీయ విశ్వ విద్యాలయం, ప్రతి గ్రామానికి తారు రోడ్డు, జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు, సర్వీసు రోడ్డు, పార్కులు, నగరవనం, చెరువుల అభివృద్ధి, టూరిజం, బోటింగ్, దేవాలయాలభివృద్ధి, సాధి ఖానాలభివృద్ధి చేపట్టారని వివరించారు. వివిధ సామాజిక వర్గాల కమ్యూనిటీ హాల్లు, ప్రభుత్వ కార్యాలయాలకు నూతన భవంతులు, అతిథి గృహాలు, ఇండర్ స్టేడియం, క్లబ్ హౌస్‌లు, రవాణా శిక్షణా కేంద్రం, రోడ్ల వెడల్పు,సెంట్రల్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులను చేసిన ఘనత బుగ్గనదే అన్నారు.

ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

డోన్ టౌన్ : మెప్మాలో పని చేస్తున్న ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, అబ్బాస్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు సుగుణమ్మలు కోరారు. శుక్రవారం ఆర్పీలతో సమావేశమైన వారు నూతనంగా ఏఐటీయూసీ కార్యవర్గంలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజల దరికి చేర్చే ఆర్పీలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం నూతన కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలుగా ఫాతీమా, అధ్యక్షులుగా ఇందిర, ఉపాధ్యక్షులుగా రాధ, సరోజ, నిర్మలభాయ్, ప్రధాన కార్యదర్శిగా సులోచన, సహాయ కార్యదర్శులుగా రాధ, నాగమణి, కోశాధికారిగా హసీనా, గౌరవ సలహాదారులుగా పుల్లయ్య,అబ్బాస్‌ను ఎన్నుకున్నారు.

నిత్యావసర సరుకులు అందజేత

డోన్ టౌన్ : శ్రీవాసవి అన్నపూర్ణ పథకంలో భాగంగా పట్టణానికి చెందిన దివంగత నారాయణ సతీమణి కుటుంబానికి శుక్రవారం ఆవోపా నాయకులు నిత్యావసర సరుకులు అందజేశారు. ధర్మారం పట్టణానికి చెందిన నారాయణ స్వామి భార్య సంజీవ లక్ష్మీ ఆర్థిక సాయంతో నిత్యావసర సరుకులు అందజేసినట్లు ఈ సందర్భంగా ఆవోపా సంఘం కార్యదర్శి జొన్నలగడ్డ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమం ఆవోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుర్గం అంబికేశ్వర్, సభ్యులు బొగ్గరపు ముద్దయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కాటసాని ఓబులరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని స్వగృహంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పుట్టినరోజు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని తనయుడు కాటసాని ఓబులరెడ్డి, సోదరుడు కాటసాని తిరుపాల్‌రెడ్డి అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అనంతరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కాటసాని ఓబులరెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి అన్నదానం చేశారు. అదేవిధంగా 250 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీతో పాటు రూ.30వేల విలువ క్రీడా పరికారాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సౌకర్యార్థం సొంత ఖర్చులతో బోరు వేయించారు. వెంటనే పైప్‌లైన్ సౌకర్యం కల్పిస్తామని వారు తెలిపారు.

సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందజేస్తున్న నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ ఫలాలు అందజేస్తూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ సభ్యుడు మూర్తుజావలి పేర్కొన్నారు. పట్టణంలోని జెండా పేట కాలనీల్లో వార్డు కౌన్సిలర్ ఇబ్రహీమ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, సలీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం వారు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజాసంక్షేమానికి, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేసి మండలంలో బీసీ రెసిడెన్షియల్ స్కూలు, ఐటీఐ కళాశాల, ఎంఎస్ఎమ్ ఇనిస్టిట్యూట్, పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారన్నారు. అదేవిధంగా నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు.

రిజర్వాయర్ల నిర్మాణాలు చేపట్టాలి

కోవెలకుంట్ల: కుందూనదిపై రెండు చోట్ల నిర్మించ తలపెట్టిన రిజర్వాయర్లను త్వరితగతిన పూర్తి చేయాలని కుందూ పోరాట సమితి కన్వీనర్ కామని వేణుగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోవెలకుంట్ల మండలం జోళదరాశి, చాగలమర్రి మండలం రాజోలి వద్ద కుందూనదిపై రిజర్వాయర్ల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ పూర్తి అయిందన్నారు. ఆయా ప్రాంతాల్లో భూసేకరణకు రైతులతో మాట్లాడి ధరలు నిర్ణయించి నష్టపరిహారం చెల్లించేందుకు టోకన్లు ఇచ్చారన్నారు. వీలైనంత త్వరలో రైతులకు పరిహారం చెల్లించి రిజర్వాయర్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. రెండుచోట్ల రిజర్వాయర్లు పూర్తయితే ఉమ్మడి కర్నూలు, వైఎస్సార్ జిల్లాల్లో కేసీ ఆయకట్టు స్థిరీకరణతోపాటు వేలాది గ్రామాలకు తాగు, సాగునీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

క్రికెట్ బ్యాట్లు పంపిణీ



నొస్సం టీంకు బ్యాట్లను అందజేస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లెరూరల్: సంజామల మండలం నొస్సం గ్రామానికి చెందిన క్రికెట్ టీంకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువనేత కాటసాని ఓబులరెడ్డి శుక్రవారం క్రికెట్ బ్యాట్లు పంపిణీ చేశారు. స్థానిక ఎమ్మెల్యే కాటసాని స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాటసాని ఓబులరెడ్డి మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహించేందుకు క్రీడా పరికరాలను ఉచితంగా అంద జేస్తునట్లు తెలిపారు. కార్యక్రమంలో టీం సభ్యులు ఖాలీద్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు రాయితీ చెక్కులను అందజేస్తున్న మేనేజర్ పీవీ మధుసూదన్‌బాబు

బనగానపల్లెరూరల్: విజయ డైరీ యాజమాన్యం పాడి రైతులకు కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని బనగానపల్లె విజయడైరీ యూనిట్ మేనేజర్ పీవీ మధుసూదన్ బాబు సూచించారు. ఇతర జిల్లాలో కొనుగోలు చేసిన పాడి గేదేలకు విజయడైరీ సంస్థ అందించే 20 శాతం రాయితీని శుక్రవారం పాడిరైతులకు ఆయన అందజేశారు. బనగానపల్లె పట్టణానికి చెందిన ఇద్దరు రైతులకు రూ. 26300, అవుకు మండలం వేములపాడుకు చెందిన ఎనిమిది మంది రైతులకు రూ.1,36,000 చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌బాబు మాట్లాడుతూ ప్రైవేట్ డైరీలకు పాలు పోయి రైతులకు ఆ సంస్థల నుంచి ఎలాంటి రాయితీలు ఉండవని, ప్రభుత్వరంగ సంస్థ విజయ డైరీలో పాలు పోయు రైతులకు మాత్రమే ఇలాంటి రాయితీలు సంస్థ అందజేస్తుందని గుర్తు చేశారు. ఇంకా విజయ డైరీ సంస్థ ద్వారా పాడి రైతులకు కళ్యాణమస్తు, పశుగ్రాస సబ్సిడీ తదితర రాయితీలను అమలు చేస్తుందని వివరించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు పోషకాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త సుధాకర్

బనగానపల్లెరూరల్: వర్షాధార పంటలు సాగు చేయు రైతులు యాజమాన్య పద్ధతులను తప్పని సరిగా పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)వ్యవసాయ శాస్త్రవేత్త సుధాకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో ఉన్న కేవీకేలో జాతీయ వాతావరణ వినూత్న వ్యవసాయ పథకం కింద రైతులు వర్షాభావ పరిస్థితుల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్త సుధాకర్ మాట్లాడుతూ ప్రస్తుతం పంటలు బెట్టపోకుండా 13.0.45 అనే పోషకకాలను 10 గ్రాములు లీటర్ నీటిలో రెండు శాతం యూరియాను కలిపి పిచికారీ చేయాలన్నారు. ఇంకా పంటలు వేయని రైతులు కంది, కొర్ర, ఆముదం పంటలు సెప్టెంబర్ నెలాఖరు వరకు విత్తుకోవచ్చనని సూచించారు. ఉద్యానపంటల ప్రాముఖ్యతపై శాస్త్రవేత్తలు బాలరాజు, ఆది నారాయణ, రవిగౌడ్ రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం 13.0.45 పోషకాలను రైతులకు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని ఇండస్ట్రీయల్ సబ్ స్టేషన్ పరిధిలో చింతలపేట, కొచ్చెర్వు ఫీడర్‌ల కింద 11కేవీ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 7గంటల వరకు ఆ గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేశ్వరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయానికి ఉదయం 5 గంటల నుంచి సరఫరా చేస్తామన్నారు. అలాగే పట్టణంలో తారకరామ నగర్ పెట్రోల్ బంక్ నుండి కంభాలపాడు బైపాస్ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాత స్థంబాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. దీంతో తారకరామనగర్ ప్రాంతంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంటు ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామం విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతులు జరుగుతున్నందున ఆర్ఎస్ రంగాపురం మినహా మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధు సూధన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. రైతులు, వ్యాపారులు, పరిశ్రమల యజమానులు గమనించి సహకరించాలని కోరారు.

బనగానపల్లె రూరల్ : మండలంలోని పసుపల, పాతపాడు, బనగానపల్లె విద్యుత్ సబ్ స్టేషన్లలో మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సంజామల: మండల కేంద్రం సంజామలతో పాటు పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరలో అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్ల మరమ్మతుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు విద్యుత్ సరఫర నిలిపివేస్తున్నామని, వినియోదారులు సహకరించాలని వారు కోరారు.

కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

బనగానపల్లెరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏపీ ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరిరావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక పాండురంగస్వామి ఆలయంలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ కార్మికుల సమావేశం జరిగింది. కార్యక్రమంలో తాఫీ మేస్త్రీల సంఘం గౌరవ సలహాదారుడు మక్బుల్‌హుస్సేన్, బనగానపల్లె మండల ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేబూబ్‌బాషా, కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలం పాటలు వాయిదా

బేతంచెర్ల: శ్రీ మద్దిలేటి నరసింహస్వామి స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించే తలానీలాల, పూల అంగళ్లకు శుక్రవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన బహిరంగ వేలం పాటలు వాయిదా పడ్డాయి. వేలం పాటలకు పాటదారులు రాకపోవడంతో సెప్టెంబర్ 5వ తేదీకి వాయిదా వేసినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు.

వాసవీమాతకు లక్ష మల్లెపూల అర్చన



లక్ష మల్లెపూల అర్చనలు చేస్తున్న భక్తులు

డోన్ టౌన్ : పట్టణంలోని అమ్మవారిశాలలో వెలసిన అమ్మవారికి వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో అధిక శ్రావణ మాసం నిజ శుక్రవారాన్ని పురష్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో శ్రీవాసవీమాతకు లక్ష మల్లెపూలతో అర్చన నిర్వహించారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

డోన్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో వెలసిన శ్రీకనక దుర్గమ్మ, గాయత్రి పీఠంలో వెలసిన గాయత్రి అమ్మవారికి శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమార్చన, అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నేతాజీ సేవలు చిరస్మరణీయం



నేతాజీ చిత్ర పటానికి పూల మాల వేస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్ : స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం అని డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నేతాజీ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో సుభాష్ చంద్రబోస్ స్థానం మరువలేనిదన్నారు. ఆయుధ పోరాటాలతో బ్రిటిష్ వారిని తరిమిట్టేందుకు ఆయన ఉద్యమం కొనసాగించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మహ్మద్‌రఫీ, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది సాయికిరణ్, దస్తగిరి, లక్ష్మీరాజ్, రమేష్, సలీం, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆకుమల్లలో వార్డు ఎన్నికలు



ఆకుమల్లలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్ అధికారి సుధాకర్, ఎంపీడీఓ నాగకుమార్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో శనివారం పదవ వార్డుకు ఉప ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుధాకర్ శుక్రవారం తెలిపారు. ఈ మేరకు పోలింగ్ కేంద్రం ఆకుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంపీడీఓ నాగకుమార్, ఈఓ పాపరాయుడితో కలిసి ఆయన పరిశీలించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. మూడు గంటల నుంచి ఓట్ల లెక్కించి వెంటనే ఫలితాలు వెల్లడిస్తామని చెప్పారు.

ఉప ఎన్నికకు సర్వం సిద్ధం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం గ్రామ పంచాయితీలో నాల్గవ వార్డు ఉప ఎన్నికకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి తహసీల్దార్ దోనీ ఆల్‌ఫ్రెడ్, ఎన్నికల సిబ్బందితో కలసి ఎంపీడీఓ సామగ్రితో బెలుం పోలింగ్ స్టేషన్‌కు వెళ్లారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా శిరివెళ్లకు చెందిన సూపరింటెండ్ కృష్ణమూర్తి, పీఓతో పాటు ముగ్గురు సిబ్బందిని ఉన్నతాధికారులు నియమించారన్నారు. నాల్గ వ వార్డులో 234 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. 2గంటల తర్వాత కౌంటింగ్ ప్రక్రియ పూర్తి చేసి విజేతను వెల్లడిస్తామన్నారు.

ఉప ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

ప్యాపిలి: మండలంలోని రెండు వార్డులకు శనివారం జరుగనున్న ఉప ఎన్నికకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ శనివారం తెలిపారు. పట్టణంలోని రెండో వార్డు, అలేబాదుతండాలో వైఎస్సార్‌సీపీ మద్దతురాలిగా జక్కు వెంకటలక్ష్మి, రమావత్ లక్ష్మిబాయి పోటీ చేస్తున్నారు. రెండో వార్డులో మొత్తం 614 మంది ఓటర్లు, అలేబాదుతండాలో మొత్తం 70 మంది ఓటర్లు శనివారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉప ఎన్నికకు రెండు వార్డు స్థానాలకు కలిపి ఏడుగురు అధికారులు, పోలీసులు విధులు నిర్వర్తించనున్నారు. కాగా రెండు వార్డు స్థానాల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారుల పట్ల ఓటర్లు సానుకూలంగా ఉండటంతో ఆయా అభ్యర్థులు విజయం పట్ల ధీమాగా ఉన్నారు. శనివారం ఉదయం 7 నుంచి 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి అనంతరం ఓట్లను లెక్కించి ఫలితాలను వెంటనే ప్రకటిస్తారు.

ఎం,పేండేకల్లు, రహిమానుపురంలో....

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం,పేండేకల్లులో 10 వ వార్డు, రహిమానుపురంలో 6వ వార్డు ఉప ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీఓ వెంగన్న, ఈఓఆర్డీ వెంకట రంగనాయక్ తెలిపారు. రెండు గ్రామాల్లో ఇద్దరు ఆర్వోలతో పాటు 18 మంది ఎన్నికల విధులు నిర్వహిస్తారన్నారు. ఎం,పేండేకల్లులో 195 మంది ఓటర్లు, రహిమానుపురంలో 122 మంది ఓటర్లు ఉన్నట్లు వారు తెలిపారు.

అభివృద్ధి పనులు పరుగులు!


వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తోంది. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పరుగులు పెడుతున్నాయి. పట్టణాభివృద్ధికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయిస్తున్నారు. ఆయా కాలనీల్లో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పంచాయతీ కార్యాలయం నుంచి జమ్ములమడుగు చౌరస్తా వరకు 400 మీటర్ల సీసీరోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ. 4 కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధులతో చేపట్టిన డివైడర్, ఇరువైపులా సీసీరోడ్డు, సెంట్రల్ లైటింగ్ తదితర పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అలాగే గుంజలపాడు రహదారిలో డ్రైనేజీ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఈ పనులన్నీ పూర్తయితే కోవెలకుంట్లకు కొత్త శోభ సంతరించుకోనుంది. – కోవెలకుంట్ల



సీసీరోడ్డు నిర్మాణానికి ఎర్త్‌వర్క్ పనులు



డివైడర్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం



చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణ పనులు